

# కోర్టులో రామ

మా కోర్టు విలేఖరి

(ఊహయే దీని కాధారము)


కట్టమంచి రామలింగారెడ్డిగారు కూడా బోను యెక్కడమే అని అంతా ఆశ్చర్యపడుతూ వున్నారు పుకారులు విని. నాటిసాయంత్రపు పత్రికలు ఆ వార్తను రూఢిపరచినవి. మరునాడు పదిగంటలకు పబ్లిక్ కోర్టులో కేసు విచారణ.

* * *

ఈ మదరాసులో విద్యార్థి బృందమంతా క్రికెట్ ఆటకు ఉదయమే ప్రయాణము కట్టినట్లుగా కోర్టువద్ద హాజరయారు. మదరాసులోని రాజకీయ వాదులంతా అక్కడనే కాంగ్రెసు నాయకులే గాక జస్టిస్ నాయకు లంతా హాజరయారు. నగరములోని ప్రొఫెసర్లు, ప్రధానోపాధ్యాయులు చాలమంది హాజరయారు.

కోర్టులో గుసగుసలు యెక్కువ య్యెవి. "ఇంత కును రెడ్డిగారు ప్రస్తుతం యొదులోగాని, అంత యెక్కువ జోక్యము కలుగజేసి కోవడము లేదే, ఆయనమీద కేసేమిటి, ఆశ్చర్యం !" అంటూ ఒక అరవరాజకీయు, ప్రక్కనున్న జస్టిస్ నాయకునితో అన్నాడు. "ఒక పార్టీ నుండి మరొక పార్టీకి మారుతూ వుండడమే దీనికి కారణము కావచ్చు—యెన్నాళ్లుసాగుతాయి ఆటలు, అందుకోసమే కావచ్చు యీ విచారణం" అని మరొక జస్టిస్ పక్షీయు డన్నాడు. "ఆయనే తన కేసును వాదించుకొంటాడను కొంటా, నిజంగా చాలా "విట్టీ"గా వుంటుంది. ఎంతసేపైనా ఉండితీరవలసిందే"అని ఒక విద్యార్థి తనస్నేహితునితో అన్నాడు.

పదిన్నరఅయింది. న్యాయమూర్తి కోర్టుహాలులో కాలుబెట్టాడు. హాలంతా ఒక్కమారుగా నిశ్శబ్దమయి పోయింది. పబ్లిక్ ప్రాసిక్యూటరు చిత్రగుప్త యేవేవో కట్టలు పట్టుకొని బల్లమీద పెట్టుకొని వాటినుండి ఒక కాగితమును చేతపట్టుకొని నిలువబడెను. గుమస్తాలు న్యాయమూర్తియెదుట కొన్ని కాగితములనుంచారు. ఇంతలో కట్టమంచి రామలింగారెడ్డిగారిని వెంటబెట్టుకొని పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ కోర్టులో ప్రవేశించాడు. రెడ్డిగారిని చూడగానే కోర్టులో హాజరయినవారిలో గుసగుసలు బయలుదేరినవి. ఆయన చిరునవ్వుముఖముతో అందరిని చూస్తూయుండిరి. ఉన్నకొలదియు గుసగుసలు యెక్కువకావడముచూచి పోలీస్ 'సైలెన్స్' అని కేక



# లింగారెడ్డిగారు

వేసెను. మళ్ళీ అంతా నిశ్శబ్దము అయిపోయింది.

పబ్లిక్ ప్రాసిక్యూటరు చిత్రగుప్తవద్దనుండి తీసికొన్న కాగితమును గుమస్తా న్యాయమూర్తియెదుట బెట్టాడు. న్యాయమూర్తి వాటిని పరీక్షించి రెడ్డిగారివైపు తిరిగి యీవిధంగా అన్నాడు.—

"పదవులకోసము రాజకీయములలోనికి వస్తూ పోతూ వుంటే నిన్ను యీ స్వార్థపరతకు పదవుల వ్యామోహమునకు యెందుకు శిక్షింపరాదు ?"

రామలింగారెడ్డి:- నేను నిర్దోషిని. పదవులకోసము యిపుడు తిరిగి రాజకీయములలో కాలుబెట్టలేదు. ఈ సమయమున దేశమునకు కొంత సేవచేయగలనను నమ్మకము కలిగినమీదనే నేను రాజకీయములలోనికి వచ్చాను. నేను నిర్దోషిని. నామీద అనవసరముగ యీ అభియోగము తీసికొనిరాబడినది.

న్యాయమూర్తి కాగితములను యిటు నటు తిరుగవేసి పబ్లిక్ ప్రాసిక్యూటరువైపు తిరిగాడు.

చిత్రగుప్త పబ్లిక్ ప్రాసిక్యూటరు తాను కోర్టునకు సమర్పించిన అభియోగముయొక్క అవసరాన్ని సమర్థించుకొన మొదలుబెట్టాడు.

చిత్రగుప్త పబ్లిక్ ప్రా:- ఈ అభియోగాన్ని తీసికొనివచ్చుటలో నాకు పార్టీమీద యెటువంటి ప్రత్యేక కారణముగాని, అసూయగాని, లేదు. ఇటువంటి రాజకీయపు టెత్తులవల్ల దేశములో సక్రమ రాజకీయములకుగాని, ఆశయములకోసము కడవరకు పాటుబడే పార్టీలుగాని, దేశములో వుండనీయవు. తద్వారా పర్యాప్తి కావలసిన శాంతి పటాపంచలవుతుంది. అందువల్లనే కోర్టువారి సమక్షానికి నే నీ అభియోగాన్ని తీసుకవచ్చాను.

నేను మోపిననేరము ఆధారములేనిదని రెడ్డిగారు అన్నారు. అంత సునాయాసముగా త్రోసిపారవేయుటకు వీలులేదు. రెడ్డిగారిని యిదివరలో ఎశెంబ్లీ సభ్యత్వానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేయడానికి రమ్మనమని కాంగ్రెసువారు ఆహ్వానిస్తే "నేను ముసలివాణ్ణయ్యాను, active politicsలోకి రాలేను" అని చెప్పి యీయన చల్లగాతప్పించుకొన్నారు. అందువల్ల

కాంగ్రెస్‌వారు అభ్యర్థిని నిలువబెట్టుకొనడానికి చాల కష్టమయినది. కాని, వీరు చెప్పిన ముసలితనము, ఆ "రిటైర్మెంటు" అన్నీ మదరాసు కౌన్సిల్ పేరు చెప్పేసరికిమాత్రము రాలేదు. ఏమూలలకు పోయినవో గాని, వెంటనే ముందుకు ఉరికారు. ఆ నియోజకవర్గములో "చక్రపటాకీ"లాగు సంచారము చేశారు. బై ఎలెక్షనులో కాంగ్రెసు అభ్యర్థిగా నిలిచి నేడు మదరాసు శాసనసభ్యులయారు. రాజకీయములలో యిటువంటివర్తనము యెంతమాత్రమును పనికిరాదు. ఇదివరకు ఎసెంబ్లీకి పిలిచినప్పుడు లేనిఓపిక యిప్పుడెక్కడ వచ్చినది? వచ్చే యెన్నికలలో కాంగ్రెసు శాసనసభలను అతి సునాయాసముగా ఆక్రమిస్తుంది. అప్పుడు కాంగ్రెస్సే ఒకవేళ మంత్రిపదవులు స్వీకరించడమువస్తే పెద్దతలకాయను కదా నాకొక మంత్రిపదవి దక్కదా అనేఆశ యీయనకు యెక్కువగావుంది. ఇప్పుడేకాదు, పదవులంటే యీయనకు మొదటనుండియు ప్రత్యేకాభిమానము. ఆ పదవుల సంపాదనాప్రయత్నములోనే ఎన్నోమారులు పార్టీ ఫిరాయింపులు జరిపారు. కొంతకాలము వీరు జస్టిస్ పార్టీలో ఒక ప్రముఖస్థానము వహిస్తూవుండేవారు. ఆతరువాత పార్టీమార్చారు. జస్టిస్‌పార్టీని మదరాసు శాసనసభలో క్రిందా మీదా పెడుతూ వచ్చారు. దానిననుసరించియే రెడ్డిగారు ఆంధ్ర విశ్వకళాపరిషత్తు వైస్ ఛాన్సిలరయారు. ఆ పదవిలో కొన్నియేళ్లుండి చివర రాజీనామాయిచ్చి చిత్తూరులో విశ్రాంతిని తీసికొన ప్రారంభించారు. మరల యింతలో యీ మంత్రి పదవుల వ్యామోహాముతో యిలా తిరిగారు. ప్రజాజీవనము గడపేవారు పదవులన్నను గౌరవములన్నను యింతటి వ్యామోహాము చూపడము ప్రజలకు చెడ్డ ఆదర్శము చూపుట వంటిది. ఈ కారణములవల్ల రాజకీయ వాతావరణములో యిటువంటి దేమీ లేకుండా చేయడానికి తగిన కట్టుదిట్టములు చేయవలసినదని కోర్టువారిని కోరుతున్నాను.

పబ్లిక్ ప్రాసిక్యూటరు తనవాదనను ముగించిన వెంటనే న్యాయమూర్తి రెడ్డిగారివైపుతిరిగారు. కోర్టువారి అనుమతికూడ రామలింగారెడ్డిగారు తమ పక్షాన్ని సమర్థించుకొన మొదలుబెట్టారు.

రామలింగారెడ్డి:-పబ్లిక్ ప్రాసిక్యూటరు తెచ్చిన అభియోగము యెంత నీరసమైనదో యీపాటికి కోర్టువారే గ్రహించియుంటారు. నాలో స్వార్థము వుందని, పదవులు గౌరవములు అంటే నాకు చాల అభిలాష అని వీటివల్ల చెడ్డ ఆదర్శములు యేర్పడుతున్నవని ఆయన అభిప్రాయము. కాని, ఆశలేనిదే జగత్తే నడువదు. ఆశలేని జీవితము యెండుకట్టెవంటిది. అటువంటి వారివల్ల దేశానికి యేమాత్రపు లాభముగాని, యుండదు. తరువాత పార్టీలుమారుట నాకొక మంచి నీటి ప్రవాహామువంటి విషయమని పబ్లిక్ ప్రాసిక్యూటరు తేల్చారు. అసలు రాజకీయములంటే యేమిటో పబ్లిక్ ప్రాసిక్యూటరుగారికి తెలియనట్లుంది! నూతిలోని నీళ్లలాగు చలనములేకుండావుండేవి రాజకీయములు కావు. రాజకీయములు నూనె పరుగుడువంటివి. అది ఎన్నోవిధములుగా జారిపోతూవున్నవి. అనేక ఆకారములు తాలుస్తూవుంటవి. అనేకమార్పులు చెందుతూ వుంటవి. అటువంటి సమయమున రాజకీయములలో మార్పు వుందంటే—అదిఒక తప్పుగాచెపుతూవుంటే నాకు నవ్వు వస్తూవుంది. ఇంక పదవులు; పదవుల ప్రాకులాట, పదవులుండిన—అవి యెటువంటి గౌరవలోపముగాని లేకుండ సంపాదింప వీలుండినయడల ఆ పదవులకు ప్రయత్నించడములో అవమానము నాకేమియు కానుపించదు. ఇది నా పరిస్థితి. పబ్లిక్ ప్రాసిక్యూటరు యీ అభియోగాన్ని యెందుకు తెచ్చారో యిపుడు కోర్టువారు గ్రహించి న్యాయం జరుపగలరు.

## కోర్టులో రామలింగారెడ్డిగారు

న్యాయమూర్తి యిరుపక్షముల వాదనను వినిన మీదట అరగంటకాలము తన ప్రత్యేకాగారములోనికి వెళ్ళి వచ్చి యీ క్రిందివిధమున తీర్పుచెప్పెను:—

నేడు తేబడిన అభియోగమునకు యిది సరియైన సమయము కాదు. అభియోగమునకు తగినవన్ని ఆధారములున్నను సమయముకాని, కారణమున దాని నంత పాటించుటకు వీలులేదు. ప్రజా సంస్థలతరపున ప్రతినిధులై స్వార్థాశయులను సఫలతనొందించుకొన ప్రయత్నించడము సత్యము నాధారపడిన రాజ నీతి వర్తనము కాజాలదు. ఐనను కేసు కొట్టివేయడమైనది.

చిత్రగుప్త విడి సంచికలు

హిగ్గిన్ బోథామ్సు రైల్వే పుస్తకశాలలలోను, వీలర్ కంపెనీ రైల్వే పుస్తకశాలలలోను విక్రయింపబడును.

ఈ క్రింది ప్రదేశాలకు

ఏజంట్లు కావాలి.

మంచి కమీషను యివ్వబడును.

| | |
|---|---|
| కడప | వెంకటగిరి |
| బళ్ళారి | ఆదోని |
| రాయచూరు | మంగళగిరి |
| సోముపేట | మైసూరు |
| పుత్తూరు | పెద్దాపురము |

వివరాలకు వ్రాయండి.

చిత్రగుప్త

సాపుకార్పేట, మదరాసు.

